# వానా, వనజా, రామ్మూర్తి!

(కథకుడు: ముందే మనవిచేసుకోవటం మంచిది. ఈ కథ డబ్బున్న వాళ్ళకూ, కార్లున్నవాళ్ళకూ కాదు. వెనకటికి నా స్నేహితుడొకడు ప్రసంగవశాన 'నేను వారంరోజులు నిరాహారంగా ఉండవలసివచ్చింది. దారిద్ర్యంవలన'అంటే నేనునమ్మలేకపోయాను. అట్లానే యీ కథ కొందరికి నచ్చకపోవచ్చును.)

మహానగరంలోనికి వర్షఋతువు వచ్చింది. వెనుక కావ్యాల్లోనూ, వాటిల్లోనూ చదువుకునేవాళ్ళము. మహారాజులకు వర్షఋతువు సౌఖ్యదాయకంగా వుండేదని. డబ్బున్నవాళ్ళకి ఇప్పుడూ అందంగానే వుంటుందేమో!

నా చిన్నప్పుడు మా అమ్మమ్మ అనేది. ఎవరిగురించీ సరిగా గుర్తులేదు. అన్నీ బాగానే వున్నాయిరా, ఏంలాభం, పెళ్ళాన్ని భూషణంగా చూసుకోవటం చేతగాదు—అని

అలా కాకుండా రామ్మూర్తికి భార్యంటే పంచప్రాణాలూనూ. ఎంత ప్రాణమంటే, ఇంతప్రాణమని చెప్పలేముకదా— కొన్నికొన్ని ఇష్టాలు, ఆ చిన్నారి ఇష్టానికి అనుగుణంగా రామ్మూర్తి మార్చుకున్నాడని చెప్పుటకు సందేహింపంబనిలేదు.

మహానగరం, వర్షాకాలం, డబ్బులేనివాళ్ల సంసారం గుమాస్తా అనుకుందాం. నెల చివరివారం సాయంకాలం, అథకథా ప్రారంభః

వనజ : ఈ నగరాలతో వచ్చినచిక్కు ఇదే. అబ్బబ్బ! ప్రపంచంలో యెంతెంత విచిత్రమైన మనుషులోకదా! ఎవరేనా స్నేహితుడు కనపడితే, అలా మాట్లాడుతూ గంటలు గంటలు గడపటానికి,

వీళ్ళకు ఇల్లూ వాకిలీ గుర్తురాదేమో! ఆఫీసులు విడుస్తారు. తరవాత యెక్కడో కాఫీలు తాగుతారు. ఇక పిచ్చాపాటీ మొదలుపెడతారు కాబోలు. ఆఫీసులలో అలసి అలసి వుంటారుకదా, ఇంటికి వేంచేస్తే యేమో? ఒక్కరోజు ఆఫీసుకిపోయి చూచిరావాలని ముచ్చటగా వుంది. ఇవాళ దెబ్బలాట వుందిలే. ఈ ఆర్నెల్లలోనూ, ఇది మొదటిసారా, రెండోసారా, పదోసారో పదిహేనోసారో—ఎవరు గుర్తుపెట్టుకుంటారు, చెప్మా ఏదో కథలో చదువుకున్నట్లు రాజకుమార్తె గోడమీద రక్తపుమరకలు పెట్టేదట. ఈయన ఇంటికిరావటం,ఆలస్యం చేసినప్పుడల్లా నేనేంగుర్తులు పెట్టేది. ఇంట్లో ఒక్కత్తెను, తోచక చస్తూంటే, మగ మహారాజులకేం—అందుకే గాబోల్ను మామ్మ పద్యం చదువుతుండేడి—అడవిలో మానై పుట్టవచ్చు గాని. ఆడదై పుట్టరాదట—ఇవాళ దెబ్బలాట ఉందిలే—ఎలాగూ తప్పదు.

రెండురోజులు మాట్లాడటం మానేస్తే. మహాచక్కగా వుంటుంది. కాని వుండలేనుగదా—ఇదేంఖర్మ. పంతానికి పది నిమిషాలున్నా, నవ్వాల్సిందే, ఇదేం మనిషమ్మా, ఎంత పంతమూ–అంతా వారంరోజులుగాలేదు తాను వొట్టు పెట్టుకుని. ఆరున్నరకల్లా యెలాంటి సందర్భాలలోనైనా ఇంటికి రాకపోతే, రెండురోజులు నాతో మాట్లాడవద్దు – అని చెప్పారు. అదేమో నాకు మహా వొరిగించేట్లు. నేను చెప్పిందిమాత్రం యేమిటుంది. ఆఫీసునుంచి చక్కా ఇంటికివచ్చి, ఆ తరువాత తిరుగుటకు పోవచ్చును–అనేకదా.

అదుగో కూరలబండి వచ్చేస్తున్నది.

పదినిముషాలు అటో, ఇటో, ఆరన్నమాట.

ఈ పెద్దమనిషిగారు రాలేదు. అదేమంటే వాళ్ళకు నవ్వులాటగానే ఉంటుంది వస్తున్నారేమోనని చూడాలంటే, ఆవచ్చేమనిషి

వాకిటిముందు నుంచే వెళ్ళిపోతుంటే యెంత నిరాశగా వుంటుందో. మనసు ఆర్ద్రమైపోయేవిషయం వాళ్ళకెలా తెలుస్తుంది. అలా గట్టిగా అడిగేస్తే—

"ఏం ఎందుకంత భయం. బల్లిగాని ఎత్తుకి పోతుందా?" వెటకారం.

నవ్వులుగానే వుంటుంది. మామ్మ అన్నది. "పసిదానిని-నాతల్లి యెలా దిద్దుకుంటావో." ఆ దిద్దుకున్నట్లేవుంది, ఇంతకూ చెప్పాలి. నేనూ నా సంబడమూ—

నాన్న అనేవాడు. "ఇదేం,పోయిమీదికి గిన్నెలు యెక్కించేసి, ఎదురుగా కూచుని, వుడకగానే దింపి, ఇల్లు వూడ్చేసి, కూచోటమను కున్నావా? మగవాడికి లక్ష పనులుంటాయి," అప్పుడు నాన్నంటే భయం. ఇప్పుడు అడిగేదాన్ని. ఏమిటా లక్షపనులు. పెద్ద, లోకాన్నంత వుద్ధరిస్తున్నట్లు.

అయినా యీాయనగారికేం అలాంటి లక్షపన్లు లేవుగా! కూరల బండి వెళ్ళిపోయింది.

ఏమన్నా తీసుకుందామనుకున్నా. మనసు కేమిటో వెలితిగా ఉంటున్నది. అయినా ఇంతకూ, ఆ పావలాకాసును, పెట్టెలో యే మూలవుంటుందో వెదికి బయటకు తీయాలి. ఉన్నట్లుగుర్తు. గుడ్డల కింద యెక్కడో పడివుంటుంది. ఇవాళ యీ ఇరవైతొమ్మిదో తారీకున యీాయనతో అంత తీరుబడిగా బాతాఖానీ వేసుకునేవాళ్ళు ఎవరుంటారు. సినిమాకుగాని వెళ్లటానికి ఏ స్నేహితుడికిమాత్రం ధైర్యం యెలా చాలుతుంది. ఇదేం, ఇరవైతొమ్మిదా? లేక ఒకటా

ఇంతకూ నన్ననుకోవాలి. చక్కగావీధివాకిలి గడియబెట్టుకూచుంటే, ఎప్పుడో రాకపోతారూ-వచ్చినప్పుడు గట్టిగా-"ఎవరండీ – ఆయన ఇంట్లో లేరు!"

"నే నే"

"నేనంటే"

"నా పేరు చెప్పాలా?"

"ఊఁ......"

ఆడగొంతుతో "వనజ..." ఒక్కొక్క అక్షరమే పట్టిపట్టి.

నాకు నవ్వొస్తుంది.

ఇంతకూ ఈయన రాలేదేం చెప్మా. ఇంట్లో వుండేవాళ్ళఆలోచనలు, మనస్సు వాళ్లకెలా తెలుస్తాయి. బజారున నడుస్తున్నా, ప హోటల్లో కూచున్నా ఇంటితొందరలేదు. పది విషయాలు చర్చిస్తుంటారు, మరి ఇంటిదగ్గరున్నవాళ్లకు వొకటే ఆలోచనాయె. వీళ్లకు యెన్నెన్ని పిచ్చి పిచ్చి వూహాలు రావటానికి అవకాశముంటుంది. నామట్టుకు నాకు పుట్టినే తెలియకుండా యేడుపొస్తుంది. అర్థంకాదు. వాన కురుస్తున్నది, ఇక నేం యీయనగారికి మంచిసాకు, ఇప్పుడిప్పుడే ఇల్లు చేరరు. వీధివాకిలి గడియైనా పెట్టివస్తాను.

*కథకుడు* : అసలు కథ ఇదండీ. ఇవాళ ఇరవైతొమ్మిది తారీకు. పొద్దున్న నిద్రలేచినతర్వాత చిన్నారిపెట్టిన కాఫీ ఇవాళ యెందుకో చెడిపోయింది. ఆమాట అనమూలేక యెలాగో తాగేశాడు, సన్నగా తుంపరపడుతున్నది. బట్టలకోసం చాకలాడిదగ్గరకు వెళితే వాడు కోపంగా 'ఆరిచావటంలేదు.' అని గట్టిగా అరిచాడు. రామ్మూర్తికి కోపం వచ్చింది. అయినా ఏంచేసేదిలేక ఇంటికివచ్చా

డు. తుప్పర ఆగిపోయింది. ఎక్కడో యెండపొడ కూడా మెరిసింది. రేపటికైనా గుడ్డలు రావచ్చునని సంతుష్టిపడి తక్కిన కార్యక్రమాలకి పూనుకున్నాడు. పదిగంటలకి ఇంటిముందునుంచే బస్సు వెళ్లిపోతుంది. ఇప్పుడు తనదగ్గర రెండణాలుకూడా లేదు. ఏంచెయ్యాలి? అని కాసేపు మథనపడ్డాడు. ఒక ఊహరాగా సంతోషపడి మంచి మాట చెపుతాను రమ్మని పిలిచి చిన్నారి దగ్గరకురాగా, చిల్లర డబ్బులవిషయమై ప్రార్థనా పరదీనానా...ననా...యేవో అయినాడు. మీరు కళ్లుమూసుకోండి" అన్నది. చాలా బుద్ధిమంతుడిలాగా కళ్లుమూసుకున్నాడు. ఆమెకు లోపల రెండు పావలాలూ ఇచ్చేద్దామనేవుంది. అయినా రేపుకూడా ఇంతేకదా- రేపు మళ్లీ ఇంతప్రార్థనా అయినా తర్వాత కళ్లుమూసుకున్న తర్వాత చేతులోపెట్టి వేళ్ళు మూసేసి, కళ్ళు తెరిచినతరువాత తాను కళ్ళుమూసుకుంటే — "అమ్మాదొంగా! ఎంత దొంగవేనువ్వు. నిన్నలేదన్నావు-'' అని ...అని ఆడవాళ్ల దాపరికంమీద వొక ఉపన్యాసం, ఇస్తేవినవచ్చును కదా! అని వనజ వొక పావలా కాసు మాత్రమే అరచేతిలోపెట్టి వేళ్ళుమూసి. చెయ్యి గట్టిగానొక్కి వదిలిపెట్టింది.

ఎప్పుడో పండక్కి అలక సాగించగా మామగారి పేరున (సిగ్గుచేటు!) కుట్టించుకున్న వులన్ పాంటు (ఖరీదు దగ్గర దగ్గర నలభై రూపాయలు!) ఒక్కటంటే ఒక్కటే వున్నది. ఆ మాటంటే— వనజ అంటుంది- అవునండీ నా పెట్టెనిండా పట్టుచీరలే— మీరు (కొని) పెట్టినవి— తొడుక్కొని మాసిపోయిన తెల్లచొక్కా, సెకండ్ టర్న్ దాంట్లో ఇన్‌షర్టుచేసి- ఆఫీసుకి బయలుదేరాడు. (ఈమధ్య పదిగంటలకల్లా ఆఫీసులకి పోవాలిట—గుమాస్తాలు మాత్రమేనా!!!-)

రెండణాలన్నర బస్ టికెట్ కే పోయింది. మహానగరంలో ఆఫీసులు ఇళ్లదగ్గర వుండవు. ఇళ్ల ఖరీదులు- అనగా అద్దెలు- చాలా యెక్కువ కాబట్టి, రామ్మూర్తికి రెండు గంటలప్పుడు ఆకలైంది. జేబులో ఒక అణా, మూడు నయాపైసాలూ మాత్ర మే వుంది. చప్రాసీవచ్చి ఫైళ్ళుఫైళ్ళు – దొంతర్లు దొంతర్లు ఇదిగో సాబ్ యీ ఫైలు ఆఫీసరుగారికి అర్జంటుగా కావాలట.

రామ్మూర్తికి మండుకు పోయింది. దుఃఖం లాంటిది వచ్చింది. వెధవజన్మ- హూ- అనుకున్నాడు అలలు అలలుగా. సినిమాలోవలె ఆలోచనలు వచ్చాయ్. తన కేసి చూచుకున్నాడు. తన ఖరీదు ప్రస్తుతం యాభైరూపాయలు. అయినా తన దగ్గర అణన్నరకంటే యెక్కువ లేదు. ఆడవాళ్ళకు యీ కష్టంలేదుకదా? (కష్టంలేని వాళ్ళకు)! ఎంచక్కా ఇంట్లోనే వుండవచ్చును. ఆకలైతే గూళ్ళూ డబ్బాలూ వెతికి పచ్చివడియాలైనా తినవచ్చును. ఆఫీసర్లుగానూ ఆడవాళ్లూగానూ పుట్టాలంటే అదృష్టముండాలి. అని ఏమిటేమిటో ఆలోచించుకొనుచుండగా– చప్రాసీ వచ్చినవాడాయెను.

"మీకోసం ఎవరో వచ్చారండీ"

రామ్మూర్తికి కించిత్ సంతోషం (సంధి తప్పేమో!) కలిగి "ప్రవేశపెట్టు" అన్నాడు.

ఆ వచ్చేవాడేమో– సుడిగాలిలావచ్చి "చచ్చిరిసోదరుల్ ..." అని రాగయుక్తంగా ఎత్తుకున్నాడు. వాడి నోరుమూసి "నాయనా ఇది హోస్టలుగాదు. ఆఫీసు. పక్కనే ఆఫీసరుగా(డు)రున్నారు. అని నచ్చచెప్పి, అమందానంద కందళిత హృదయార ...[పోనిద్దురూ— ఇంకా పెద్ద సమాసం వేసేవాణ్ణే. కాని కొద్దికష్టం!] ఆ, మరేం

వాడు ఇంకోడు ఇంకోడా- సాక్షాత్తు సుబ్బారాయుడూ- ఆ బాల్య మిత్ర రత్నంబు— చాలా రోజుల తరువాత కనిపించాడు. పచ్చిక మీద నిలబడి కావిలించుకుని, "సుబ్బారావ్! ఎప్పుడొచ్చావురా — పంచేస్తున్నట్లు, శుక్లాంబరంధరం... వలెనే రోడ్లమీద నేనా..." అని అడిగాడు రామ్మూర్తి.

వెనకెప్పుడో ఆ శ్లోకపాదాన్ని గాడిదకు సమన్వయం చేశాడట ఎవరో పండితమ్మన్యుడు.

"లేదు, చిట్టిబాబూ! మన స్టార్ తిరిగింది. ఐ మీన్ ఎ .పి. యస్. సి. వాళ్లు ఇంటర్వ్యూకి పిలిచారు. నేతివిరిగి రొట్టెలో పడ బోతూ... మనకు లెక్చరర్ ఉద్యోగం రావచ్చును..."

పోనీ ఆదృష్టవంతుడివి చాలా సంతోషపడి, ఫైళ్ళను వాటి పాపాన వాటిని వదిలేసి, మస్తుగా తిని (ఎలాగూ బిల్లు వాడే చెల్లించుకుంటాడు!) అంతరాత్మకు విరుద్ధంగా సిగరెట్ ముట్టించు కుని— ఇక్కడ వొక అంతర్కథ వున్నది.

(పాఠక మహాశయులారా— నన్ను క్షమింపుడు) ఆ కథ యేదనగా- వారం రోజులక్రితం రామ్మూర్తి పెళ్లాం "సాక్షిగా" దైవసాక్షిగా 'ఇక చస్తే సిగరెట్ ముట్టించను' అని ఒట్టు పెట్టు కున్నాడు.

సుబ్బారావుతో "అప్పుడే మూడున్నర అయింది. ఇంకొక గంట, అట్టే వాగకుండా నా పక్కకుర్చీలో కూచున్నావా? మా ఆఫీసరుగారు మంచివాడు. అడిగి ఐదు కాకముందే వెళ్లిపోవచ్చును" అని చెప్పాడు రామ్మూర్తి. సుబ్బారావు, అలా అలా తిరిగివస్తానని

వెళ్ళిపోయాడు. ఐదు కాకముందే సుబ్బారావు వచ్చాడు. రామ్మూర్తి బయటపడ్డాడు.

ఐదున్నరకు బస్ స్టాప్ దగ్గరకు వచ్చి "ఇంటికి వెళదాం సుబ్బారావ్" అన్నాడు రామ్మూర్తి.

"వెధవ్వేషా లెయ్యకు ఈ భూప్రపంచంలో నీ వొక్కడికే గాదు పెళ్ళాముంది. సినిమాకు పోయితీరవలెరు. మీరజాలగలడా సత్యాపతి నా యానతి..."

రామ్మూర్తి కళ్ళనీళ్ళ పర్యంతమై, సిగ్గూ, మానమూ, లజ్జా ఔచిత్యమూ, అన్నీ గాలికి వదిలేసి—

"మా ఆవిడంటే నాకు భయంరా" అని కూడా చెప్పాడు. "నేను ఐదున్నరకు ముందే ఇంటికొస్తానని ఒట్టేసుకున్నాను కూడా" అని చెప్పాడు.

ఏం చెప్పినా సుబ్బారావు వినలేదు.

ఇంగ్లీషు పిక్చరు కాబట్టి తొమ్మిదిగంటలకల్లా అయిపోయింది.

బయటకు వచ్చినతర్వాత సుబ్బారావు, రామ్మూర్తి బుగ్గమీద కొట్టి "ఇంక వెళ్లు. ఆలస్యం చెయ్యకుండా పొద్దున్నే వచ్చి ఇంకా వుంటే ప్రణయకలహం, నేను తీరుస్తాను" అన్నాడు.

రామ్మూర్తి బ్రతిమాలాడు సుబ్బారావుని రమ్మని. సుబ్బారావు వినకుండా బస్‌లో వెళ్ళిపోయాడు.

రామ్మూర్తి రోడ్డుమీద మిగిలాడు. ఇకరాండి ముందుకథకి—

రామ్మూర్తి:- నే నెట్లా చావను ఇప్పుడు.

సుబ్బారావు కనపడక కనపడక చాలా రోజులకే కనుపించాడనుకో— నేను వాణ్ని కావిలించు కున్నానే అనుకో— సినిమాకు వెళ్ళామే అనుకో- ఇప్పుడు తొమ్మిది అయిందే అనుకో- ఈ అణన్నరతో ఇల్లు చేరటం ఎట్లా- చిన్నారి కన్నీళ్ళు తుడవటం యెట్లా. పరుగెత్తి పోయినా గంట పడుతుందే— పడమటి వేపున మబ్బులు వస్తున్నాయే- "మిగుల జగంబు బెగ్గడిల మించె తదద్భుతవృష్టి..." అన్నట్లు జడివాన కురిస్తే- నేను ఇల్లెలా చేరుకోను? వులెన్ పాంటు చూస్తుంటే కన్నీళ్లు వచ్చేలా వున్నాయి.

రామ్మూర్తీ! నువు దడిగాడు వానసిరాలో తిప్పి చదివిన మొదటి మూడతురాలవు. వెయ్యేళ్ళు ధనంతో వర్ధిల్లు వాడవ్వు. చిన్నారి యేమనుకుంటున్నదో- ఆ గుండె యెన్ని ఊహలు చేస్తున్నదో, ఎంత కసిగా వుందో ఏం చెయ్యాలి ఇప్పుడు. వాన కురుస్తున్నది. రామచంద్రా! ఈ అణన్నరతో బస్ యెంతదూరం తీసుకవెళ్తే అంతదూరం పోతాను. తరువాత భగవంతుడు కరుణిస్తాడు. వాన ఆగిపోతుంది. మబ్బులు తేలిపోతాయి. ఆమె ముఖాన మబ్బులు కూడా తేలిపొయ్యేట్లు చెయ్యవచ్చును. ఆమె కన్నీళ్లుకూడా వెలిసేట్లు చెయ్యవచ్చును. ఎలానో ప్రాధేయపడి, అమ్మయ్య బస్సువస్తున్నది.

తొమ్మిదింబావూ, ఎలాగూ పదిగంటలకల్లా ఇల్లు చేరుకుంటాను. అరె— ఇదేమిటి. బస్ ఆగకుండానే వెళ్ళిపోతున్నది. అదేం, లోపల మనుషులు తొక్కుకుని వున్నారు.

ఈ వెధవ సినిమాలు మనుషుల కొంపలు దీస్తున్నాయి. అదిగో తొక్కుకుని చస్తున్నారు. సినిమా వదిలిపెట్టగా యెక్కిన జనమేననుకుంటాను. ఇది బావుంది. ఇలా అయిదు బస్సులు వెళ్లిపోతే నేనేం

చెయ్యాలి. ఇంటి కెప్పుడు చేరుతానో? మళ్ళీ బస్ యెప్పుడు వస్తుందో? ఇంకెప్పుడూ వర్షాకాలంలో సినిమాకు పోతే వొట్టు - పోనీ రిక్షావాణ్ణెవణ్ణయినా పిలిస్తే, అణన్నరను తలుచుకుంటే దుఃఖం వస్తున్నది. పైన రిక్షాలో తడవనని యేముంది. రిక్షావాణ్ణి వాకిట్లో నిలిపి యింట్లోక్కి పోయి తలుపులు వేసుకోనా— ఇంత వానలో మరి ఇరుగు పొరుగువాళ్ళు నిద్ర పోతుంటారే— ఆరణాలు అర్థరాత్రివేళ అప్పడగనా? చిల్లరలేదండీ- అంటాము. సరే—వాళ్లు కూడా "మాదగ్గర కూడా లేదండీ" బయటనుంచి రిక్షావాడు "ఏందయ్యోవ్, నా పైసలు పారేయ్". నేను యెట్లా చచ్చేదిప్పడు?

ఏయ్ రిక్షా...వస్తావా?

ఒక రూపాయి కావాలట. ఏడ్చినట్టుంది. "పోబాబూ" 'ఏమిస్తావు దొరా? ఎంత దర్పం?" వాన కురుస్తున్నది కదూ - అవునుమరి వాడు వులెన్ పాంట్లు తొడుక్కోడాయె. తడిసి తడిసి ఇవాళ రెండు రూపాయలు తీసుకుని ఇంటికిపోతే వాడి పెళ్ళాం కాచటమో, కషాయ మవ్వటమో చేస్తుంది.

ఈ వులన్ పాంటు వొకటి. నాకు వురిలా వుంది. తడిస్తే తడుస్తాను. పోతానా. అమ్మో! నలభైరూపాయలు. నాకు సగం జీతం. చిన్నారి ఏమనుకుంటున్నదో... భయపడుతున్నదో వొంటరిగా. అమ్మయ్య బస్ వచ్చింది.

బ్రతికాను, తొమ్మిదీ నలభైఅయిదు.

అణన్నర చేతిలో పెట్టాను. నేను దిగవలసిన స్టాప్ అరమైలు వుంటుంది. అప్పటికి వాన ఆగిపోతే... భగవంతుని దయవలన ఆగిపోతుంది. ఈ బస్ మా ఇంటిదాకా వస్తే యెంత బావుండును.

నాకో చిన్నకారుంటే యెంత బావుండును. ఆఫీసు కాగానే సుబ్బారావుని కూచోబెట్టుకుని ఇంటికిపోయి చిన్నారిని వెంటబెట్టుకుని సినిమాకు వచ్చి, చినుకు మీద పడకుండా సుబ్బారావుని వాడి లాడ్జిలో దింపి... సరే...సరే...కోరికలే గుఱ్ఱాలైతే స్వారీచెయ్యని దెవ్వరు!

వాన కురుస్తూనేవుంది. కదిలే బస్ ముందు ఒక్కొక్క స్టాప్ రాకుండా వుంటుందా? వచ్చింది. ఇప్పుడు చావాలి. దిగుతాను. దిగక తప్పుతుందా...ఆహో మొహంమ్మీద కొట్టిపోయింది వానజల్లు. ఈ వానలెందుకండీ! వానల్లేని సృష్టి యెంత బావుండును. బస్ వెళ్ళిపోయింది. ఇక్కడ చెట్టుతప్ప యేమీలేదు. ఈ స్టాప్ దగ్గర రెండు కాంటీన్లుండాలి కాబోలు. ఒకటి మూసేశారప్పుడే. ఇంకోటి తెరచేవుంది. కాసేపు అక్కడగాని కూచుంటాను. వాన ఇప్పుడప్పుడే తెరపి ఇచ్చేట్లులేదు.

*కథకుడు—ఇదండీ కథ!*

పది నిమిషాలు తక్కువ పదయింది. కాంటిన్లో రామ్మూర్తి కూచున్నాడు. రామ్మూర్తికి మల్లేనే ఇంకా ఇద్దరు ముగ్గురు కూచుని వున్నారు. వాన తెరపిన పడితే వెళ్ళిపోవచ్చునని. రామ్మూర్తికి చాలా ఆకలిగావుంది. సన్న తుంపర పడుతున్నా వెళ్ళిపోవచ్చును, అరమైలులో వుంటుంది ఇల్లు. సర్వర్ వచ్చి 'ఏంకావాలి?' అని అడిగాడు. రామ్మూర్తికి సిగ్గయింది. ఏమొద్దు! అని చెప్పాడు. వాడు మంచినీళ్లు తెచ్చిపెట్టి పోయాడు. వాడికి అపహాస్యంగా వుంది కాబోలు!... అనుకున్నాడు రామ్మూర్తి. హోటల్ యజమాని రికార్డు సంగీతం విని ఆనందిస్తున్నాడు. బయట వాన యెక్కు-

వైంది. ఉఱుములు, మెరుపులు, గుండెలవిసేట్లు, ప్రళయం వస్తుందా? ఈ సర్వలోకాలు ముంచుకొని పోతాయా! ఎక్కడో చెట్లు కూలినట్లు రేకులు లేచినట్లు, వాన...వాన...వాన రామ్మూర్తి గుండెల్లో వనజ...వనజ...వనజ...

వనజ :- నాకెందుకో ఆగకుండా యేడుపొస్తున్నది. ఇప్పుడు పదో. పదకొండో, పన్నెండో అయివుంటుంది, ఇరుగు పొరుగు వాళ్లు నిద్రపోతున్నారు. వాళ్లను పలకరిద్దామా! అంటే యేమని చెబుతాను? "మావారు ఇంకా ఇంటికి రాలేదు. నాకు భయంగా వుంది"-అని ఎలా చెబుతాను. మామ్మ వస్తానన్నప్పుడు తీసుకొస్తే యెంత బావుండేది! ఇంటిదగ్గర ఇబ్బందని రాలేదు. ఇప్పుడెలా? ఇప్పుడెలా? గడియవేసిన అరక్షణం కాకముందే గడియతీసి వాకిట్లోకి చూడాలని తాపత్రయం. ఏముంది వాకిట్లో! చీకటి. మెఱుపులు, ఉఱుములు. ఎవరన్నా గబుక్కున తడుస్తూ ఇంట్లోకివస్తే- అయన రారేం!... వస్తే దెబ్బలాడను, పాదాలకు మొక్కుతాను. యేడుస్తాను. ఇంకెప్పుడూ ఇలా చేయకండి... ఛీ! మరీ పిచ్చిదాన్నయినా నేమిటి? సినిమాకు పోయిఉంటారు. సినిమా వదలగానే వర్షం పట్టుకుని వుంటుంది. ఈ వానలో రిక్షాలుకూడా రావు. పాపిష్టిదాన్ని- ఆ నాలుగణాలూ పొద్దునే ఇస్తే ఎంత బావుండేది. ఆయన రిక్షాలో వచ్చేవారు. ఊహు!... ఏంచేస్తాను! భగవంతుడి అనుగ్రహం లేకపోయినప్పుడు. ఈన రారేం!... ఈన రారేం!!... ఈన రారేం!!!... ఒక...రెండూ...మూడూ...అమ్మో పన్నెండా?

రామ్మూర్తి :- అమ్మయ్యో పన్నెండైందా? ప్రొప్రయిటర్ కుర్చీలో పడుకుని నిద్రపోతున్నాడు. వానవెలిసే సూచన ఒక్కటీ కనబడటంలేదు. నేను ఇంత బుద్ధిహీనుణ్ణయిపోయినానేం? ఎం

దుకో మనసు చాలా ఆర్ద్రమైపోతున్నది. కళ్లు తడిఅవుతున్నాయి. అందుకే గాబోలు! వెలుగుతున్న ఎలక్ట్రిక్ బల్బు రంగులు రంగులుగా కనబడుతున్నది. చిన్నారి యేడుస్తుందా? చీకటిని చీలుస్తున్న మెఱుపులకేసీ, భయపెడుతున్న ఉరుములకేసీ, కళ్లు పొడుచుకుని కనబడినంత దూరం చూస్తే రోడ్డుమీద మనిషి పాదాల చప్పుడు వినపడక, గుండెల్లోనుండి వుబికి ఉబికి వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక యేంచేస్తుంటుంది? ఇటువంటి రాత్రి యేంభయం! ఎంతభయం! ఎవరన్నా వచ్చి ఇంటిలో దూరితే ఏమనగలం? వాన. అన్నంతిని వుండదూ-నేనింత బుద్ధిలేనివాణ్ణయితే, అన్నం ఎలా తింటుంది? ఇల్లు చేరుకుంటే ఒళ్లో కూర్చో బెట్టుకుని అన్నం తినిపిస్తాను. అబ్బ! ఎంత ప్రేమ! సుబ్బారావు సిగరెట్ ఇచ్చినప్పుడు తీసుకుని కాల్చి సంతోషించలేదూ! పశువుని నేను. ఉట్టి పశువుని. సిగ్గులేకుండా. నాకు ఆకలెలా అవుతున్నదో? ఇద్దరిబిల్లూ మధ్యాహ్నం రూపాయి అయిదణాలయింది. సుబ్బారావు దగ్గర సిగ్గులేకుండా రెండు రూపాయలు తీసుకుని టాక్సీలో వెళ్లినా బావుండేది. తాను అన్నం తిని వుండదు. అవును, నేను ఇటువంటి వాణ్ణయిన తర్వాత ... ఇంకా వాన వెలిసేటట్టు లేదు. వాన, వాన, వాన, వనజ...వనజ... ఒంటిగంటైంది.

వనజ :— వాకిలి తెరిచి చూస్తే యేముంది! చీకటి. ఏ స్నేహితుడింట్లో వున్నారో, ఎక్కడ చిక్కులు పడిపోయినారో, ఆకలవుతున్నదో యేమో! కొత్తచోటికిపోతే మంచినీళ్లయినా అడిగి తీసుకోలేరు. ఇవాళ యేమిటో. మనసు యేమిటేమిటో పాడు పాడు వూహలు చేస్తున్నది. దీనంతటికీ మధ్యాహ్నం తోచక చదివిన నవల కారణం. అందులో ఇలానే వానలో చిక్కుపడి, రోడ్డు

మీద పడిపోయి... ఆస్పత్రిలో...అమ్మో...తల పగల గొట్టుకోవాలనిపిస్తున్నది. ఈ ఊహలు యెంత ఆపుకుందామనుకున్నా ఆగవు. మనసు బుద్ధిలేనిది.

రోడ్డుమీద, కటిక చీకటి. ఎడతెగని వాన, ఎవరో నడిచి వస్తుంటారు. ఏ చెట్టుకొమ్మో విరుగుతుంది. అమ్మో!...

రిక్షా వేగంగా వస్తుంది. చీకటినీ, వర్షాన్నీ చీల్చుకుని యెద్దు లాంటి లారి...రిక్షాను కొట్టుకుంటుంది.

ఈ ఊహలు రాకుండా నా తలను గోడకేసి మొత్తుకోనా? నేను పసిపిల్లనా. మరీ నా బుద్ధి ఇలా బుగ్గయిపోతున్నదేం! వాన వెలిసిపోదా? ఆయన రారా? ఒళ్ళో తల ఆన్చి యేడ్చి యేడ్చి యీ దుఃఖాన్ని పొగొట్టుకోనా —

రామ్మూర్తి: బల్లలు తుడిచేవాళ్లూ, సర్వర్‌లూ నిద్రపోతున్నారు. వాళ్లకు యే చీకూ చింతా వుండదు. సృష్టి యెంత చిత్రమైంది! పరమేశ్వరుడు యెన్నిరకాల జీవులనుసృష్టిలోచేశాడో. వీళ్లందరి జీవితాలు యెలా తెల్లవారాలో! ఏ ఊరో, ఏ పల్లె, ఎక్కడ నించి వచ్చారో. ఎఱ్ఱటి గడ్డం ఇరానీవాడు ప్రొప్రయిటర్. ఎదురుగా వానవెలిస్తే పోదామని కూచున్న ఇంకా ఇద్దరూ— ఒకతను ఇంతకుముందు వెళ్లిపోయాడు. నేను వెళ్లిపోదును. ఈ ఉలన్ ప్యాంటు ఒకటి. నాకు ఉరి. ఎందుకో మనుషులకింత తాపత్రయం. ఎప్పుడో చచ్చిపోతామని అందరికీ తెలుసునుగదా! ఈ జుట్టు తెల్లబడుతుందనీ, ఈ కంటికి చూపు తగ్గుతుందనీ. ఈ ఉలన్ ప్యాంటు వుండదనీ- మళ్లీ ఎందుకో మమకారం. ఎందుకా—పొద్దున్నే ఆఫీసు ఆఫీసరూ-చిన్నారీ-సినిమాలు. బంగాళా దుంపలూ, ఉల్లిపాయలు

కలిపి వేయించిన వేపుడూ...ఆవకాయా...ఇవి... ఇవన్నీ వున్నందుకు. నాకు నవ్వొస్తున్నది. ఎప్పుడూ రాని ఊహాలు వస్తున్నాయి. పరమేశ్వరుణ్ణి గురించి యెప్పుడైనా తల్చుకున్నానూ! ఇవాళ యీ ఊహాలు యెందుకు కలుగుతున్నాయో! నేను బి. ఏ. ఫిలాసఫీ. వెలగబెడుతున్నది సెక్రటేరియట్ గుమాస్తా ఉద్యోగం.

రెండు గంటలైంది. నిద్ర రాక ఏడ్చ ఏడ్చి కళ్ళు ఎఱ్ఱబడి, సొమ్మసిల్లి నిర్వచించరాని వేదనతో ... ఏ ఆలోచనలు చేస్తున్నదో... ఎలానైనా ఆడువాళ్లుమరి. మొన్ననేకదా పదహారు వెళ్లి పదిహేడు వచ్చింది. ఈ యీడుకే నాకు చీకటంటేనే భయం.

వనజ: రెండుకొట్టింది, గడియారం. నాకు యేడుపు పోయింది. ఇంకెందుకు యేడుపు? మళ్లీ కోపం వస్తున్నది. ఇక యెప్పుడూ జన్మలో మరచిపోలేనట్లుగా అడగవలసిన నాలుగూ అడుగుతాను. ఏం అడుగను? ఏదీ ... వస్తే ... ఎక్కడున్నారో ... మనస్సు ఇలా ఆర్ద్రమైపోతున్నది. దుఃఖం కూడా రావటంలేదు. పడుకోలేను. కూచోలేను. వాకిలి తెరుస్తాను. ఉఱుములు మెఱుపులు ఆగిపోయినయ్. ఇక వాన వెలిసి పోవచ్చు. ఎలానైనా గంట పడుతుంది. ఆయన వచ్చేసరికి.

రామ్మూర్తి: అమ్మయ్య వాన ఆగిపోయింది. చూడు ఇక యెంత వడిగానడుస్తానో! ఈ కాంటిస్‌కు నమస్కారం. జన్మలో మరచిపోను దీన్ని. అబ్బ సృష్టి యెంత అందమైంది. ఇంత బీభత్సం. తరువాత ఎంత ప్రశాంతత. ఒక్కొక్క చినుకు చెట్ల ఆకుల మీదనుంచి రాలి వీథిదీపాల కాంతికి మెరిసిపోతున్నది. రోడ్లమీద నీళ్లు యెంత ప్రశాంతంగా వున్నాయో. ఓహో... మబ్బుల్లోంచి,... చందమామ ...ఓరి... మామయ్యా... మా ఆవిడా నేను కూచుని నిన్ను

చూస్తూ భోజనం చేస్తాంవుండు ఇప్పుడు. రామ్మూర్తీ, ఉషారుగా నడువు. నీ ఆత్మ అక్కడ నీకోసం వేకువన విచ్చుకునే పద్మాల్లా కళ్లు చేసుకొను చూస్తూ వుంటుంది; ఓహో... కవ్విత్వం వెలగ బెడుతున్నా వటయ్యా... పశు.

మూడు గంటలై వుంటుంది.పతీకులో యెంత అందముందో —అవును ఇంత భీభత్సం తర్వాత యెంత ప్రశాంతత. ఇళ్లు స్నానం చేసి వెన్నెల్లో వొళ్ళుతుడుచుకున్న మనుష్యుల్లా వున్నాయి.కొమ్మలు రోడ్డుమీద అడ్డ దిడ్డంగా పడి వున్నాయి. చల్లటిగాలి, వెన్నెల, చిన్ని చిన్ని మబ్బులు. నీవూ... నీవెధవ కవిత్వమూ నడు... నడు... ఒక్క సిగరెట్ ముట్టించుకుంటే బాగుండును. కొట్లు యెక్కడా తెరచిలేవు. ఓరి పశు... అవును నువ్వుమనిషివి. అనగా పశువుకన్నా కొండొకచో అధముడివి. (కొండొకచో అనాలి గాబోలు) రాకే వచ్చానయ్యా— అదుగో నేను అనుకుంటూనే వున్నాను. ఒక్క సారియెగిరి ఎదురుగావాలి యెత్తుకోనా?! ఎదకు హత్తుకోనా!! బుర దలో పడతావు జాగ్రత్త... చిన్నారీ... చిన్నారీ... నీకళ్ళు... ఇలా... చిన్నారీ... ఎందుకే అలా యేడుస్తావు... ఇదిగో చూడు నన్నూ యేడవ మంటావా—!

కథకుడు: మన్నించాలి మళ్ళీ నేను వచ్చినందుకు. ఇప్పటికే విసుగువచ్చి వుంటుంది మీకు (ఎందుకేం) వాళ్లు అరగంటదాకా మాట్లాడుకోలేదు అని చెప్పి పోదామనే వచ్చాను. అంటే అప్పటికి నాలుగైందన్న మాట.

"లేవండి మరి అన్నం పెడతాను" అన్నది వనజ అతగాడి యెదకు హత్తుకుని.

"కానీ మరి ఇపుడే లేవ బుద్ధి పుట్టడంలేదే. ఎంత అందం ప్రవహిస్తుందో చూడు. బయట జరిగిందేదో మంచికే జరిగింది. ఇలానే కాలం స్తంభించిపోతే యెంత బాగుండును. మనం ఇలానే యెన్నో యేళ్ళు వుండి వుండి గడ్డకట్టుకుని శిలలమైపోతే—"

"ఊ! బాగానే వుంది కవిత్వం..." "ఊహూ..."

"చూడండీ మీకు, అయితే ఇంతకూ పెళ్ళాంకన్నా పాంటు యెక్కువన్నమాట!"

"ఇదిగో చూడు చిన్నదానా— అది శంకరాచార్యులవారు చెప్పారు. పారమార్థిక సత్యమని...వ్యావహారిక సత్యమని... పెళ్లాం పారిమార్థిక సత్యం... పాంటు— అందులో పులెన్‌ది. వ్యావహారిక సత్యం..."

"సరి...సరి... ఇంకలేవండి మరి... అవన్నీ నీకు తెలీవు మీరు వచ్చారు. అంతేచాలు" మళ్ళీ ఆమెగొంతు అర్ద్రమైంది. కళ్లు తడిసాయి.

"అయితే ఇవాళ అట్లతద్దె భోజనం చేద్దా మంటావు?"

ఆమె కిలకిలా నవ్వింది.